సాక్షి
అనకాపల్లి
బుధవారం । 9 । జూలై । 2025



హాస్టళ్ల తనిఖీ

మహారాణిపేట: ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు మంగళవారం విశాఖలో బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లను తనిఖీ చేశారు.



కరాటేలో అరుదైన ఘనత

గాజువాక: కరాటే కోచ్ కోరాడ సుమన్ ఏసియన్ కరాటే ఫెడరేషన్ కాటా విభాగంలో న్యాయనిర్ణేతగా డిప్లొమాలు పొందారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 34.2 నుంచి 35.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 26.1 నుంచి 26.6 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని, గాలి గంటకు 10 నుంచి 11 కి.మీ. వేగంతో వీస్తుందని ఆమె చెప్పారు.

న్యూస్‌రీల్

పారిశుధ్య సమస్యకు తొలి ప్రాధాన్యం

● నూతన జోనల్ కమిషనర్ చక్రవర్తి



అనకాపల్లి టౌన్: పారిశుధ్య సమస్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని జీవీఎంసీ నూతన జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పనిచేసిన అనుభవం ఉందని, అనకాపల్లి పట్టణంలోని పరిస్థితులు తనకు తెలుసునన్నారు. సమస్యలపై ప్రజలు తనను నేరుగా కలవచ్చన్నారు. ఇక్కడి ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. విశాఖపట్నంలో వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన డిప్యుటేషన్‌పై జోనల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు మాతృశాఖ నుంచి అనుమతి లభించింది.

కలెక్టర్‌కు హస్త కళాకారుల సమస్యల ఏకరువు



హస్త కళాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

యలమంచిలి రూరల్: కలెక్టర్ విజయ కృష్ణన్ ఎదుట ఏటికొప్పాక హస్త కళాకారులు తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. 50 ఏళ్లకే సామాజిక భద్రత పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని, రాయితీ రుణాలు ఇప్పించాలని వారంతా ఆమెను కోరారు. మంగళవారం ఏటికొప్పాకలో హస్త కళాకారులతో కలెక్టర్ ముఖాముఖి సమావేశమయ్యారు. లక్కబొమ్మల తయారీ కోసం అ తి ముఖ్యమైన అంకుడు కర్ర తెచ్చుకోవడానికి అటవీ శాఖ ఆంక్షలతో ఎదురవుతున్న ఇబ్బందులు చెప్పుకున్నారు. 16వ నంబరు జాతీయ రహదారి నుంచి ఏటికొప్పాక గ్రామానికి వెడల్పు రహదారి వేస్తే పర్యాటకులు ఎక్కువగా వస్తారన్నారు. పెట్టుబడి లేక పోవడంతో ఆర్థిక వనరుల కోసం స్థానిక వ్యాపారులపై ఆధారపడడం వల్ల తాము ఎదగలేకపోతున్నామన్నారు. ఇక్కడి హస్త కళాకారుల స్థితిగతులపై నివేదిక తయారు చేయాలని పరిశ్రమలు శాఖ జీఎం, యలమంచిలి ఎంపీడీవో, మరికొందరు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ హస్త కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కె.వరహాలు, కాండ్రకోట చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా మహానేత జయంతి వేడుకలు

జోహార్ వైఎస్సార్

ఊరూరా సేవా కార్యక్రమాలతో నివాళులర్పించిన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



తెనుగుపూడిలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తదితరులు



నర్సీపట్నంలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

సాక్షి, అనకాపల్లి/అనకాపల్లి:

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి.. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. పేదలకు దుస్తులు, నిత్యావసర సరకులు అందించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనకాపల్లి రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయం, చోడవరం, బుచ్చెయ్యపేటల్లో జరిగిన జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

పేదల గుండెల్లో దేవుడు వైఎస్సార్

దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి, నిరుపేదల గుండెల్లో గుడి కట్టుకున్న దేవుడని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమర్‌నాథ్.. పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీతో కలిసి మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఏళ్లు గడిచినా దివంగత మహానేత వైఎస్సార్‌పై ప్రజల్లో ఉన్న అభిమానం చెక్కు చెదరలేదన్నారు. **మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఫీజు** రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ వంటి సేవలు, పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అనకాపల్లి రూరల్, కశింకోట మండలంలోని పలు గ్రామాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మీ గున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవిందు, మలసాల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవా కార్యక్రమాలు

● మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో దేవరాపల్లి మండలం తెనుగుపూడి గ్రామంలో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు బూరే బాబురావు పాల్గొన్నారు. కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పాల్గొన్నారు.



వాడ్రాపల్లిలో బియ్యం పంపిణీ చేస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

● యలమంచిలి టౌన్‌లో ఎంపీపీ బోదెపు గోవిందు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర ఆధ్వర్యంలో, ఏటికొప్పాకలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు, సీనియర్ నాయకుడు సేనాపతి రాము ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. మునగపాక మండలంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో, అచ్యుతాపురంలో పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రిల్లో పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ లాలం రాము, ఎంపీపీ కోన సంధ్యా బుజ్జి పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నర్సీపట్నం మున్సిపల్ స్టేడియం వద్ద గల వైఎస్సార్ విగ్రహాన్ని నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పాయకరావుపేట సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు నక్కపల్లి, ఎస్.రాయవరంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాయకరావుపేటలో పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో రైతులు, వృద్ధ దంపతులు పోసిన పెద్ద అప్పారావు, చిన్నమ్మలను సన్మానించారు. జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కె.కె.ఆర్.ఎస్.లత, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ వైఎస్సార్‌కు నివాళులర్పించారు. 100 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కోటవురట్లలో కాకినాడ పార్లమెంటు పరిశీలకుడు సూర్యనారాయణరాజు, రాష్ట్ర కార్యదర్శి దత్తుడు శీతబాబు, సిద్దాపతులు సత్యనారాయణ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: చోడవరం టౌన్ గాంధీగ్రామం, బుచ్చెయ్యపేటల్లో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. బుచ్చెయ్యపేటలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. చోడవరంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏరువాక సత్యారావు, జెడ్పీటీసీలు మారిశెట్టి శ్రీకాంత్, దొండా రాంబాబు, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు



కశింకోటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



నక్కపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ సమన్వయకర్త కంబాల జోగులు



బుచ్చెయ్యపేటలో అమర్‌నాథ్‌కు కేక్ తినిపిస్తున్న కరణం ధర్మశ్రీ

అప్పన్నా.. వస్తున్నాం..



ముస్తాబవుతున్న పుష్పరథం

నేడే సింహగిరి ప్రదక్షిణ

మధ్యాహ్నం 2 గంటలకు పుష్పరథం ప్రారంభం

రేపు వేకువజాము 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణ





సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంజేసిన 32 కిలోమీటర్ల కొండ చుట్టూ ప్రదక్షిణ చేసే సమయం వచ్చింది. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని బుధవారం గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుంది. ఈ ఏడాది సుమారు 6 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారని అంచనా వేశారు. ఈ మేరకు కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసింది.

సింహగిరికి మెట్లమార్గంలో అనుమతి

గురువారం కొండపైకి కేవలం మెట్లమార్గంలో మాత్రమే అనుమతి ఇస్తారు. ఆరోజు ఉదయం 3 గంటల నుంచి భక్తుల రద్దీ ముగిసే వరకు కొండదిగువకి వచ్చే భక్తులను దేవస్థానం బస్సులు, దేవస్థానం అద్దె చెల్లించిన 50 ఆర్టీసీ బస్సుల్లోను ఉచితంగా చేరవేస్తారు.



రెండో ఘాట్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అప్పన్న నమూనా ఆలయం

దర్శనాల సమయాలు

బుధవారం ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి ఆదేరోజు రాత్రి చేరుకునే భక్తులకు రాత్రి 9 గంటల వరకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. ఆ తర్వాత తిరిగివారికి 10వ తేదీ ఉదయం 5.30 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దర్శనాలు ఉండవు. తిరిగి సాయత్రం 5.30 గంటల నుంచి దర్శనాలు లభిస్తాయి.

రేపు ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతిస్తారు. ఆలయ బాహ్య ప్రకారం చుట్టూ 400 మీటర్ల మేర ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది. ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి ఉత్తర రాజగోపురం వద్ద, దక్షిణ రాజగోపురం వద్ద వంతెలను ఏర్పాటు చేశారు.

32 కి.మీ మేర సాకర్యాలు

దాబాగార్డెన్స్: గిరి ప్రదక్షిణకు జీవీఎంసీ పక్కా ఏర్పాట్లు చేసిందని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. భక్తుల కోసం 32 కి.మీ మేర సౌకర్యాలు కల్పించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రసాద వితరణకు ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కవర్లు, స్పూన్లు, ఫోర్క్‌లు వంటివి కాకుండా పర్యావరణ హితమైన వస్తువులు ఉపయోగించాలని కోరారు.

ఏర్పాట్ల పరిశీలన : గిరిప్రదక్షిణ ఏర్పాట్లను మంగళవారం జేసీ మయూర్ అశోక్ పరిశీలించారు. భక్తులకు ప్రదక్షిణ మార్గం తెలిసేవిధంగా సూచిక బోర్డులు ఎక్కువగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవో త్రినాథరావు ఏర్పాట్లను జేసీకి వివరించారు.

200 ఆర్టీసీ బస్సులు




దాబాగార్డెన్స్: గిరిప్రదక్షిణ భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 200 ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. సింహాచలం కొండపై నుంచి దిగువకు 50 బస్సులు, సింహాచలం నుంచి ద్వారకా బస్‌స్టేషన్, గాజువాక, ఆర్కే బీచ్, కొత్తవలస తదితర ప్రాంతాలకు సుమారుగా 150 బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. ఈ బస్సులు బుధవారం ఉదయం 5 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ రద్దీని బట్టి నడపనున్నట్టు చెప్పారు.

ఏర్పాట్లు ఇలా..



గిరిప్రదక్షిణ మార్గంలో స్టాల్స్

- సింహాచలంలోని తొలిపావంచా వద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు కొబ్బరికాయ కొట్టి రథం ప్రారంభిస్తారు.
- అక్కడ భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకు 45 క్యూలు, 100 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు.
- అడవివరం–హనుమంతవాక బీఆర్‌టీఎస్ మార్గంలో రెండో టోల్‌గేట్ వద్ద నుంచి ప్రదక్షిణ ప్రారంభించే భక్తుల సౌకర్యార్థం కొబ్బరి కాయలు కొట్టేందుకు 20 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అక్కడ స్వామివారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేశారు.
- 177 శాశ్వత మరుగుదొడ్లకు అదనంగా మరో 500 తాత్కాలిక మరుగుదొడ్లు జీవీఎంసీ ఏర్పాటు చేసింది.
- వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు షిఫ్ట్‌కి 640 మంది చొప్పున మూడు షిఫ్ట్‌లకు 1,920 మంది కార్మికులను ఏర్పాటు చేశారు.
- ప్రతీ 200 మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 132 తాగునీటి పాయింట్లు జీవీఎంసీ ఏర్పాటు చేసింది.
- అప్పుఘర్ వద్ద 5 బోట్లు, 60 మంది గజ ఈతగాళ్లు, హైపవర్ లైటింగ్ ఏర్పాటు చేశారు.
- 32 చోట్ల వైద్య శిబిరాలు, 18 అంబులెన్సులు, రెండు సూపర్ స్పెషాల్టీ వైద్య బృందాలు ఏర్పాటు చేశారు.
- 32 ప్రదేశాల్లో 200 వాట్స్ సామర్థ్యం కలిగిన 750 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. 9 జనరేటర్లు అందుబాటులో ఉంచారు.
- నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో 2,460 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.
- ప్రతీ ఆరు కిలోమీటరుకు ఒక బృందం చొప్పున మూడు షిఫ్టుల్లో ఆరు బృందాలను కలెక్టర్ హరేందిర ప్రసాద్ నియమించారు. డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు అధికారి పర్యవేక్షణలో ఒక్కో బృందంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్, వైద్య, విద్య, విద్యుత్, రెవెన్యూ, జీవీఎంసీ, ఆర్అండ్‌బీ, రవాణాశాల అధికారులు, సిబ్బంది ఉంటారు.
- 9వ తేదీ ఉదయం 6 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.
- భక్తులకు అందుబాటులో టోల్ ఫ్రీనెంబరు 1800-4250-0009, 0891-2507225లను ఏర్పాటు చేశారు.
- కొండదిగువ తొలిపావంచా, అడవివరం, పాతగోశాల జంక్షన్, అప్పుఘర్, మాధవధారలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంలు ఏర్పాటు చేశారు.
- జోడుగుళ్లపాలెం వద్ద సముద్రస్నానాలకు అనుమతి ఇవ్వలేదు.
- లుంబిని పార్క్ వద్ద తాత్కాలిక స్నానపు గదులు, టాయ్‌లెట్లు, తాగునీరు ఏర్పాటు చేశారు.
- గిరి ప్రదక్షిణ మార్గంలో పాఠశాలలు, కల్యాణ మండపాల్లో మొత్తం 14 చోట్ల విశ్రాంతి ప్రాంతాలను గుర్తించారు.
- 10న సింహగిరిపై అన్నప్రసాద భవనంలో కదంబం, దద్దోజనం అన్నప్రసాదంగా అందజేస్తారు.
- ఉచిత, రూ.100, రూ..300 దర్శనాల క్యూలను ఏర్పాటు చేశారు.
- భక్తుల కోసం సుమారు లక్ష లడ్డులను విక్రయానికి సిద్ధం చేశారు.



సింహగిరిపై దర్శనం క్యూలు

క్లుప్తంగా

రేగుపాలెం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ



రేగుపాలెం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యాధికారి ఎం.హైమావతి మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీకి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆస్పత్రిలో రికార్డులు, శస్త్ర చికిత్సలు చేసే గది, ఫార్మసీలను పరిశీలించారు. ఆశా వర్కర్లతో జరుగుతున్న సమావేశాన్ని సందర్శించిన ఆమె.. ఆశా వర్కర్ల సేవలు ఎంతో కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేసే విధానంపై అవగాహన కల్పించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీల్లో శస్త్రచికిత్సలు చేయాలని, అప్పుడే ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ఆస్పత్రి వైద్యురాలు రోహిణీ శివ, ఎంపీహెచ్‌ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఆస్పత్రి సిబ్బంది లీలావతి, మాణిక్యం, నూకరత్నం పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం



వెంకటాపురంలో పర్యటిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యం అమలు తీరుతో పాటు సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి ముందు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బుట్టలో వేసుకోవాలన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఈవోఆర్డీ సోమరాజు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములు పరిశీలించిన బీడీఎల్ ప్రతినిధులు



బీడీఎల్ ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

మాకవరపాలెం: ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న భూములను మంగళవారం భారత్ డైనమిక్ లిమిటెడ్(బీడీఎల్) ప్రతినిధులు పరిశీలించారు. మండలంలోని రాచపల్లి రెవెన్యూలో 300 ఎకరాల భూమి ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. దీనిని పరిశ్రమల స్థాపనకు కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బీడీఎల్ ప్రతినిధులు రా మన్నపాలెం ప్రాంతంలో ఉన్న భూముల్లో పర్యటించారు. వారికి స్థానిక తహసీల్దార్ వెంకటరమణ భూముల వివరాలను తెలియజేశారు. విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారి నుంచి ఈ భూముల్లోకి వెళ్లే రహదారులను కూడా పరిశీలించారు.

ఫీజు బకాయిల కోసం ఆందోళన బాట

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ, మానవహారం
- మంత్రి లోకేశ్, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



బకాయిలు విడుదల చేయాలంటూ డీటీ వినయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



యలమంచిలి వైఎస్సార్ కూడలి వద్ద మానవహారం చేస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6400 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యలమంచిలి పట్టణంలో మంగళవారం విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. పట్టణంలో వైఎస్సార్ కూడలి వద్ద మానవహారం నిర్వహించిన విద్యార్థులు అక్కడి నుంచి ప్రధాన రహదారిపై తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యువగళం పాదయాత్ర సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారంలోకి రాగానే ఫీజులు, హాస్టళ్ల నిర్వహణ బకాయిలు విడుదల చేస్తామని, జీవో నంబరు 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఇప్పటి వరకు హామీ నెరవేర్చలేదని ఆరోపిస్తూ విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బ్యానర్లు ప్రదర్శించి నిరసన తెలిపారు. అనంతరం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగించిన విద్యార్థులనుద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీ, ఫణీంద్ర మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం ప్రజాప్రతినిధులకు తగదన్నారు. కళాశాలలకు ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. కొందరు విద్యార్థులు సర్టిఫికెట్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీజీ విద్యార్థులకు ఫీజులు ఎగ్గొట్టే జీవో నంబరు 77ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 11న జిల్లాల కలెక్టరేట్ల వద్ద మహా ధర్నా చేయనున్నట్టు వారు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు కె.మణికంఠ, వివిధ ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ పర్యటనతో గతుకుల రోడ్డుకు మోక్షం



ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న భారీ గొయ్యి(ఫైల్)



గోతులు పూడ్పించిన నాయకులు

- సొంత నిధులతో బాగు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పర్యటనతో రోలుగుంట వద్ద భీమిలి– నర్సీపట్నం రోడ్డులో ప్రమాదకర గోతులకు మోక్షం కలిగింది. ఈ రోడ్డు అభివృద్ధికి మోకాలడ్డుతూ వచ్చిన టీడీపీ నాయకులు ప్రస్తుతం అధికారంలో ఉన్నా బాగు చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో కొత్త చెరువు మలుపు నుంచి పీఏసీఎస్ వరకూ ఈ రోడ్డులో ప్రమాదకర గోతుల్లో వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వచ్చేది. అదుపు తప్పి వాహనాలు బోల్తా పడితే గాయాల పాలయ్యేవారు. ఇదిలా వుంటే ఈ నెల 6న రోలుగుంటలో పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశ స్థలం వరకూ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ ర్యాలీలో ఏ విధమైన ప్రమాదాలకు తావులేకుండా పీఏసీఎస్ నుంచి సమావేశం ఏర్పాటు చేసిన ఆర్సీఎం చర్చి వరకూ గోతుల పూడ్చే పనులను ఈ నెల 5, 6 తేదీల్లో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకట్రావు చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తమ సొంత నిధులతో గోతులు పూడ్చటంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాంతో ప్రతిపక్ష పార్టీకి క్రెడిట్ రావడంతో టీడీపీ నాయకులు మేల్కొని మంగళవారం మరికొన్ని గోతులు పూడ్చే పనులు చేపట్టారు. ఏదేమైనప్పటికీ ఈ సమస్య మెరుగుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పర్యటన ఎంతో మేలు చేసిందని స్థానికులు, వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి కార్మికుల తొలగింపునకు కూటమి కుట్ర

- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు

అనకాపల్లి: చాలీచాలని జీతాలతో ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ మెంబర్ విల్లూరి పైడారావు తెలిపారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గవరపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ వైద్యాలయంలో ఇప్పటికే ముగ్గురు పారిశుధ్య కార్మికులను తొలగించారన్నారు. మిగిలిన 9 మందిని తొలగించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా శానిటేషన్ వర్కర్లను మార్చవద్దని కోరారు. ప్రస్తుత కొత్త అడ్వైజరీ కమిటీ సభ్యుడు కాంట్రాక్టర్‌ని బెదిరించి తన మనుషుల్ని వేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేతో ఆస్పత్రి అధికారికి చెప్పడం అన్యాయమన్నారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిన్ని యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యాలయాన్ని రాజకీయాల వేదికగా మార్చొద్దన్నారు. అడ్వైజరీ కమిటీ సభ్యులు వైద్యాలయాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యాలయంపై పూర్తి దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొల్లి చిన్నప్పారావు, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాము, పల్లా సత్య అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, కుంచావారి చిన్ను, కాండ్రేగుల రామలింగేశ్వరరావు, దాడి నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

- ఆర్డీవోకు వైఎస్సార్‌సీపీ నేతల వినతి



ఆర్డీవో రమణకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంటు ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణను కోరారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవోను కలిశారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయలేదన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లయిన మహిళలు, పురుషులకు సమానంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఇంటి స్థలంతో పాటు, ఇల్లు నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. డీఫారం, ప్రభుత్వ సాగు భూముల్లో ఉన్న ఫలసాయానికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని, అనర్హులను తొలగించి అర్హులను చేర్చాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తే పనులు చేపట్టేందుకు సహకరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. అనంతరం వీసం రామకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని చాలా రోజుల నుంచి నిర్వాసితులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, ఏపీఐఐసీ పట్టించుకోలేదని ఆరోపించారు. పోలీసుల సాయంతో నిర్వాసితులను బెదిరించి పనులు కొనసాగిస్తున్నారన్నారు. అభివృద్ధిని అడ్డుకోకూడదన్న ఉద్దేశంతోనే వైఎస్సార్‌సీపీ శాంతియుతంగా పోరాటం చేస్తోందన్నారు. కేసులకు భయపడే ప్రసక్తి లేదని, మత్స్యకారులకు, నిర్వాసితులకు అండగా ఉద్యమిస్తామన్నారు. గతంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం పోరాటం చేసిన కూటమి నేతలు ఇప్పుడు ముఖం చాటేశారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓట్ల కోసం రాజకీయాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు భార్గవ్, ఎంపీటీసీ తిరుపతిరావు, గోవిందు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, తళ్ల అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములు సెజ్‌కు ఇచ్చేది లేదు

- సీపీఎం నాయకులతో కలిసి ఆర్లి గ్రామస్తుల నిరసన



ఆర్లి సచివాలయం వద్ద గ్రామస్తులతో కలిసి నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు: మండలంలోని ఆర్లి గ్రామంలో వ్యవసాయ భూములను సెజ్‌కు కేటాయించొద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వెంకన్న తెలిపారు. మంగళవారం ఆర్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి స్థానిక సచివాలయం వద్ద సెజ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సెజ్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు రహస్య సర్వేలు చేపట్టడాన్ని వెంకన్న తప్పుబట్టారు. ఎస్ఈజెడ్‌కు స్థలం కేటాయింపులు ఏ జోన్ (రెడ్, ఆరెంజ్, గ్రీన్) కిందకు వస్తాయో..ముందుగా వివరించాలని కోరారు. కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల, చోడవరం నియోజకవర్గాలు కాలుష్య రహిత జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పుడు కంపెనీల ఏర్పాటుతో ఈ ప్రాంతం కాలుష్యమయ్యే పరిస్థితి ఏర్పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి కల్పిస్తామని నమ్మించి విషం చిమ్మే కంపెనీలను తీసుకువచ్చి ప్రజల ప్రాణాలను, పొలాలను నాశనం చేయొద్దన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్రా దేముడు, గండి నాయినిబాబు, రొంగలి ముత్యాల నాయుడు, స్థానికులు ఆర్.ఎ.పాత్రుడు, రుత్తల గోవింద, బోళెం కాసుబాబు, ఎం.సోమేష్, నాగేష్, పైడిరాజు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా మార్కెట్ యార్డు అభివృద్ధి

నర్సీపట్నం : వ్యవసాయ మార్కెట్ యార్డును ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ అధ్యక్షతన పాలకవర్గం తొలి సమావేశం మంగళవారం జరిగింది. యార్డు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. చైర్మన్ మాట్లాడుతూ అభివృద్ధితో పాటు ఆదాయ వనరులను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారులు విధిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. రైతు బజార్‌ను తొందరలోనే వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. కోల్డ్‌స్టోరేజ్ నిర్మించేందుకు కమిటీలో చర్చించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ కన్నయ్యనాయుడు, కార్యదర్శి భువనేశ్వరి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తహసీల్దార్ పోస్టుల భర్తీ

డీటీలకు అడ్‌హక్ పద్ధతిలో పదోన్నతి

మహారాణిపేట: రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పలు తహసీల్దార్ పోస్టుల్లో అదే శాఖకు చెందిన డిప్యూటీ తహసీల్దార్లకు అడ్‌హక్ పద్ధతిలో పదోన్నతి కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 17 మంది డిప్యూటీ తహసీల్దార్లకు అడ్‌హక్ పద్ధతిలో తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ 17 మందిలో విశాఖకు ముగ్గురిని, అనకాపల్లికి ఒకరిని, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 13 మందిని కేటాయించారు.

- డిప్యూటీ తహసీల్దార్లు ఎ.సంతోష్ కిరణ్‌ను పెందుర్తి తహసీల్దార్‌గా, సూరిశెట్టి శ్రీనుబాబును ఆనందపురం తహసీల్దార్‌గా, బత్తుల శ్రీనివాసరావును గాజువాక తహసీల్దార్‌గా నియమించారు.
- డిప్యూటీ తహసీల్దార్లు జి.ఆనందరావు, పి.మురళీబాబు, డి.లక్ష్మయ్య, వి.శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, కె.వీరభద్రచారి, డి.అరుణ్ చంద్ర, ఎ.సంధ్య, హెచ్.త్రివేణి, కోట శంకరరావు, రాజ్‌కుమార్, హెచ్.అన్నాజీరావు, ఐ.వెంకట అప్పారావులను అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించారు. అలాగే పి.సత్యనారాయణను అనకాపల్లి జిల్లాకు కేటాయించారు. వీరికి ఆయా జిల్లాల కలెక్టర్లు పోస్టింగులు ఇవ్వాల్సి ఉంటుంది.

మత్స్యకారుడు ఎల్లాజీ కుటుంబాన్ని ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు డిమాండ్



నక్కపల్లిలో విలేకర్లతోమాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి: ఇటీవల పూడిమడక తీరంలో వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడు ఎల్లాజీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు డిమాండ్ చేశారు. మంగళవారం నక్కపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతయితే తక్షణమే నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకు సరైన గాలింపు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఎల్లాజీ క్షేమంగా ఉన్నాడో లేడో గుర్తించాలని, ఏడేళ్ల వరకు ఎటువంటి డెత్ సర్టిఫికెట్ జారీ చేయడం కుదరదని చట్టం చెబుతున్నట్టు పోలీసులు అంటున్నారన్నారు. అప్పటి వరకు గల్లంతైన వ్యక్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబం ఎలా బతుకుతుందని జోగులు ప్రశ్నించారు. అవసరమైతే మత్స్యకారుల విషయంలో చట్టసవరణ చేయాలన్నారు. తోటి మత్స్యకారులతో పాటు, గ్రామస్తులతో మాట్లాడి బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీనియర్ నాయకులు మణిరాజు, పాపారావు, ఈశ్వరరావు, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి



బాబు(ఫైల్)

కశింకోట: కశింకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక గ్రామీణ వికాస బ్యాంకు వద్ద తేగాడ వైపు వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి టాటా ఏస్ వాహనం ఈ నెల 3న ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న తేగాడకు చెందిన మామిడి బాబు(58) తీవ్రంగా గాయపడడంతో అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య చిన్ని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మునగపాకలో ఆర్డీవో పర్యటన

మునగపాక: మునగపాకలో మంగళవారం సాయంత్రం అనకాపల్లి ఆర్డీవో ఆయిషా పర్యటించారు. పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా కృష్ణంరాజు కాలువపై నిర్మించిన బ్రిడ్జిని ఆమె పరిశీలించారు. రహదారి నిర్మాణంలో భాగంగా ఆంజనేయ స్వామి ఆలయంతో సహా ఇతర షాపులను తొలగిస్తామని, ఇందుకు బాధితులు సహకరించాలన్నారు. ప్రస్తుతం 80 అడుగుల మేర ఆక్రమణలు ఉంటే వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీధర్, వీఆర్వో సురేష్ పాల్గొన్నారు.

11న వ్యవసాయ యాంత్రీకరణ మేళా



రైతులకు సూచనలిస్తున్న మోహన్‌రావు

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో ఈ నెల 11న వ్యవసాయ యాంత్రీకరణ మేళాను ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు తెలిపారు. వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. మేళా ఏర్పాటుకు అవసరమైన యార్డులోని ప్రదేశాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్ చిటికెల కన్నయ్యనాయుడు, ఏడీఏ శ్రీదేవి, యార్డు సెక్రటరీ భువనేశ్వరితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు అవసరమైన 23 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 33 వేల టన్నుల యూరియాను సిద్ధం చేశామన్నారు. 11 డ్రోన్లు మంజూరయ్యాయని, వీటిలో 7 డ్రోన్లను రైతులకు అందజేశామన్నారు.

ప్రకృతి సాగుపై మొగ్గు చూపాలి

మాకవరపాలెం: ప్రకృతి సాగుపై రైతులు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని నారాయణరాజుపేటలో మంగళవారం ఆయన పర్యటించారు. పాయకరావుపేట ఏడీ ఉమాప్రసాద్, ఏవో అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైనీ, గుట్కా అమ్మకాలపై పోలీసుల దాడులు



పాన్ షాప్‌ల్లో తనిఖీలు నిర్వహిస్తున్న రూరల్ సీఐ రేవతమ్మ, సిబ్బంది

నర్సీపట్నం: టౌన్, రూరల్ పోలీసులు మంగళవారం పాన్ షాప్‌లపై మెరుపు దాడులు నిర్వహించారు. నీలంపేట, గబ్బాడ, చెట్టుపల్లి గ్రామాల్లోని పాన్‌షాపుల్లో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. గుట్కా, ఖైనీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని షాపు యజమానులపై కేసులు నమోదు చేశారు. నర్సీపట్నం టౌన్‌లోని పాన్‌షాపుల్లో సీఐ గోవిందరావు, ఎస్ఐ రమేష్, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఖైనీ, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. పాఠశాలలు, కాలేజీలకు వంద మీటర్లలోపు నిషేధిత మత్తు పదార్థాలు అమ్మితే శిక్షార్హులు అవుతారని సీఐ రేవతమ్మ వ్యాపారులను హెచ్చరించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత మృతి



మృతురాలు రుత్తల హేమలక్ష్మి

అచ్యుతాపురం రూరల్ : భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసిన రుత్తల హేమలక్ష్మి(32) చికిత్స పొందుతూ మృతి చెందినట్టు అచ్యుతాపురం ఎస్ఐ సుధాకర్‌రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. లాలం కోడూరు గ్రామానికి చెందిన హేమలక్ష్మి, భర్త రుత్తల శ్రీను అచ్యుతాపురం మండలం భోగాపురం గ్రామంలో ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. భర్త వేధింపులు తాళలేక ఆమె ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమెను విశాఖలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అచ్యుతాపురం ఎస్ఐ తెలిపారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

■ Wanted Female teachers for 4th to 7th std for all Subjects , 10,000/-. Experience & Qualification. Ph: 91608 66003 [SCA25006072]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA25005931]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ
జిల్లా కార్యాలయం : అనకాపల్లి

శ్రీమతి విజయ కృష్ణన్, ఐ.ఎ.ఎస్
జిల్లా కలెక్టర్

రీ-టెండర్ ప్రకటన

టెండరు నెం. A.3/PDS/Stage-II Re-tenders/ Akp/Mdl/2025-27

2025-27 ఆర్థిక సంవత్సరములకు అనకాపల్లి జిల్లాలో గల మాడుగుల మండల స్థాయి గోదాము నుండి సంబంధిత మండలములకు అనుసంధానము చేసిన చౌక ధరల దుకాణములన్నింటికి మరియు సంబంధిత స్కూల్స్ మరియు హాస్టల్స్‌కు ప్రజా పంపిణీ వ్యవస్థ మరియు ఇతర ప్రభుత్వ పథకముల క్రింద నిర్దేశించిన నిత్యావసర సరుకులు రెండవ దశ రవాణాచేయుటకు ఇ-టెండర్లు ఏ.పి. ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా కోరబడుచున్నవి. టెండరు ప్రక్రియ మరియు RFP వివరములు అన్నియు www.apeprocurement.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండరు ఫారము మరియు వివరములు పొందుగోరు వారు రూ.5900/- (inclusive of GST @18%) (అక్షరాల ఐదు వేల తొమ్మిది వందల రూపాయలు మాత్రమే) ఆన్‌లైన్ ద్వారా కట్టి పొందవలెను.

1	టెండర్ ఫారం డౌన్‌లోడ్ ప్రారంభం తేది	10.07.2025 సమయం: ఉదయం 10:00 గం॥ నుండి
2	టెండర్ ఫారం డౌన్‌లోడ్ ముగింపు తేది	16.07.2025 సమయం: మధ్యాహ్నం 1:00 గం॥ వరకు
3	టెండర్ ఫారం దాఖలు చేయు ఆఖరి తేది	16.07.2025 సమయం: సాయంత్రం 5:00 గం॥ వరకు
4	టెక్నికల్ టెండర్లు తెరుచు తేది	17.07.2025 సమయం: ఉదయం 11.00 గం॥లకు
5	ఫైనాన్షియల్ టెండర్లు తెరుచు తేది	17.07.2025 సమయం: మధ్యాహ్నం 03.00 గం॥లకు
6	పూర్తి వివరాలకు సెల్ నెం : 9963479148 / 9963479147 / 9490132806 లకు సంప్రదించగలరు	

Sd/-
జిల్లా కలెక్టర్,
అనకాపల్లి

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం-I
డి.నెం.9-29-15/7, పద్మావతి టవర్స్, బాలాజీనగర్, సీతమ్మధార, విశాఖపట్నం-530003. ఫోన్: 8331036926

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ నర్సీపట్నం బ్రాంచ్ వారికి ఋణగ్రహీతలు: (1) పైల వెంకట సత్య అప్పల స్వామి నాయుడు, (2) శ్రీ పైల సాయి లిఖిత్ గార్లు చెల్లించవలసిన బకాయి రూ.16,39,627/- (అక్షరాల పదహారు లక్షల ముప్పై తొమ్మిది వేల ఆరు వందల ఇరవై ఏడు రూపాయలు మాత్రమే) + వడ్డీను కలిపి మొత్తంను రాబట్టుకొనుటకు రీజనల్ ఆఫీస్-I, కెనరా బ్యాంక్, విశాఖపట్నం అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 30-07-2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 30.07.2025, మ॥ 02.00 గం. నుండి 03.00 గం.ల వరకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పీఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 30.07.2025, మ॥ 01:00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

పూర్వం విశాఖపట్నం జిల్లా, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, కోటవురట్ల ఎస్ఆర్‌ఓ, కోటవురట్ల మండలం, పాములవాక గ్రామం మరియు గ్రామపంచాయతీ, సర్వే నెం. 122 నందు మొత్తం ఎ. 2.58 సెంట్లలో ఉన్న 215.40 చ॥గ॥ లేదా 180.0959 చ॥మీ॥ ఖాళీ స్థలంతో అందులో ఆమోదించబడిన ప్లాన్‌తో నిర్మించబడుచున్న ప్రతిపాదిత క్రొత్త ఇల్లు యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: 12 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: ఎగ్జిక్యూటెంట్ యొక్క స్థలం, పడమర: 6 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: ఎగ్జిక్యూటెంట్ యొక్క స్థలం. టైటిల్ హోల్డర్: పైల వెంకట సత్య అప్పల స్వామి నాయుడు.

రిజర్వు ధర: రూ. 20,35,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,03,500/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్మునకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, నర్సీపట్నం బ్రాంచ్, మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8333813830/ 08932-236669/ 8331019134.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పీఎస్‌బి అలయన్స్ (Baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 04-07-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

కిరాణా, పాన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు


కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: మండలంలోని కిరాణా, పాన్ షాపుల్లో పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో పాఠశాలలకు సమీపంలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేశారు. పాఠశాలల పరిసరాల్లో సిగరెట్లు, పాన్ మసాలాలు, గుట్కా, ఇతర మాదక ద్రవ్యాలను విక్రయించరాదని దుకాణ యజమానులను ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. నిబంధలను ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులను మాదక ద్రవ్యాల బారిన పడకుండా రక్షించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని సీఐ తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్

అనకాపల్లి: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం దశలు వారీగా విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2024–25 వినియోగంపై రూ.842 కోట్లు సర్దుబాటు చార్జీలను మోపుతూ సదరన్, సెంట్రల్ పంపిణీ సంస్థలు చేసిన తాజా ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2024 ఏప్రిల్ నుంచి యూనిట్‌కు రూ.40 పైసలు చొప్పున వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన ఇంధన సర్దుబాటు చార్జీలు రూ.2,787 కోట్లు తిరిగి వాపసు చేయాలన్నారు. తప్పుడు లెక్కలు ఇచ్చి అదనపు చార్జీలు వసూలు చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాజా ప్రతిపాదనలు విరమించుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమలు చేస్తామన్నారు.

దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి


సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతా

కశింకోట: మండలంలో కార్మికుల దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపు జాతా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి, తేగాడ, నరసింగబిల్లి, తాళ్లపాలెం, బుచ్చియ్యపేట తదితర గ్రామాల్లోని వివిధ పరిశ్రమల కార్మికులను జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రీయ విద్యాలయం పనులు ప్రారంభించాలి


కేవీ స్థలంలో పిచ్చిమొక్కలను చూపిస్తున్న రాజు

అనకాపల్లి: సుందరయ్యపేట పంచాయతీ అచ్చియపేటలో కేంద్రీయ విద్యాలయం(కేవీ) కోసం పదెకరాల్లో 2017లో అప్పటి టీడీపీ పాలనలో భూమిపూజ చేసి వదిలేశారని సీపీఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు తెలిపారు. ప్రస్తుతం అదే పార్టీ అధికారంలో ఉన్నందున తక్షణమే కేవీ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఇక్కడ విద్యాలయం స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. 2019లో అప్పటి ఎంపీ బీవీ సత్యవతి కేవీ భవనాలను జీ+2 తరహాలో నిర్మించేందుకు రూ.28.74 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకుని నెల రోజుల్లో పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పాల సంఘ కార్యవర్గం ఎన్నిక

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం పాల సంఘానికి ఇద్దరు అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సంఘం పాలకవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గౌతు బాబూరావు రెండేళ్లు, కలిగెట్ల సంజీవి మూడేళ్లు పదవీ కాలం వంతున అధ్యక్షులుగా కొనసాగడానికి నిర్ణయించిన మేరకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మరో 8 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.


దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అమర్‌నాథ్, ధర్మశ్రీ, భరత్‌కుమార్


కశింకోట సంతబయల రెల్లి వీధిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు


కశింకోటలోని గౌరమ్మ ఆలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల నివాళులు


గవరపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీనియర్ నాయుడు బొడ్డేడ శివ, కె.ఎం.నాయుడు

మరుపురాని మహానేత


వేల్పులవీధిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జాజుల రమేష్

- వాడవాడలా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంత్యుత్సవాలు
- పలుచోట్ల రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఊరూవాడా స్మరించుకుంది. తన ఏలుబడిలో వ్యవసాయాన్ని సుభిక్షం చేసి రైతు బాంధవుడిగా.. ఎన్నో పథకాలతో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న సంక్షేమ ప్రదాతగా వేనోళ్ల కీర్తించింది. ఈ సందర్భంగా వాడవాడలా రాజన్న జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువతీ యువకులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురు ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 63 మంది రక్తదానం చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్యులు రక్త సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సురేష్ రాజా, రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పద్మకుమారి, పార్టీ నాయకులు బొడ్డేడ శివ, కొణతాల మురళీకృష్ణ, దాడి నారాయణరావు, మళ్ల బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం, మండలంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక పెరుగు బజార్, పూడిమడక జాతీయ రహదారి జంక్షన్ వద్ద రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఆ పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


అనకాపల్లి మండలం కూండ్రంలో నివాళులర్పిస్తున్న కరణం ధర్మశ్రీ, మలసాల భరత్‌కుమార్

- వేల్పులవీధి పార్కు సెంటర్ వద్ద వేల్పులవీధి యువ నాయకుడు ఉగ్గిన అప్పారావు ఆధ్వర్యంలో


కూండ్రంలో రక్తదాన శిబిరాన్ని గ్రామ యువత

రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామారావు, కొంకి శ్రీరామ్మూర్తి, దొండా వాసు, జెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం. నాయుడు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి


ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగికి రొట్టె ఇస్తున్న పార్టీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు సిద్ధార్థ


సిరసపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకుడు ఈగల మహేష్


తాళ్లపాలెంలో వైఎస్సార్ విగ్రహం వద్ద సమన్వయకర్త భరత్‌కుమార్ నివాళులు

నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, బుద్ధ జగన్ వాసుపల్లి తాతయ్యలు, రాపేటి మహాలక్ష్మీనాయుడు, కోరిబిల్లి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

- కొత్తూరు పంచాయతీ, రామాపురం గ్రామాల్లో గ్రామ సర్పంచ్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మురుగుతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ అనపర్తి శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- కూండ్రం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయి కిరణ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరాన్ని పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రారంభించారు. 200 మందికి నిరుపేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. 24 మంది యువకులు రక్తదానం చేశారు, ఈ రక్తాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి రక్తనిధి కేంద్రానికి అందజేశారు. కార్యక్రమంలో కవలపల్లి మధుబాబు, కుంచంగి, కూండ్రం, ఆర్వీపాలెం, వేటజంగాలపాలెం పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ ఆస్పత్రిలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టరు డి.డి.ఎస్.ఎస్.సిద్ధార్థ, పార్టీ సీనియర్ నేత దండా జ్ఞానదీప్‌ల ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమం పార్టీ నాయకులు కర్రి అప్పారావు నాయుడు, నత్తల సాయి, పి. నవీన్, గుబ్బల లోకేష్ , జి.రవి తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లిలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఈగల


కొత్తూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్

మహేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్లి లక్ష్మి, తెప్పల ప్రసాద్, కొత్తపల్లి సత్తిబాబు, గుమ్మాల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో..

కశింకోట: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం కశింకోటలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ హయాం స్వర్ణయుగమని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి విశేష సేవలందించారని కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మహిళా విభాగం నాయకురాలు తగరంపూడి నూకరత్నం, యువజన విభాగం నాయకులు మలసాల కుమార్ రాజా, నీటిపల్లి దివాకర్, వియ్యపు భూలోకనాయుడు, గోకివాడ గోవింద, తదితరులు పాల్గొన్నారు. సంతబయల రెల్లి వీధిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి సర్పంచ్ మంత్రి జయరజని, పార్టీ ప్రతినిధులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అధిష్టానం పిలుపు మేరకు వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని గౌరమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, నియోజకవర్గ నాయకుడు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరిశెట్టి ఆదిబాబు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో..

కశింకోట మండలం తాళ్లపాలెంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అక్కడి కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, ఇందల ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలకు తగ్గకుండా సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

అనకాపల్లి: సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా చేతి వృత్తిదారులకు రూ.2 లక్షల తగ్గకుండా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవో శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చేతి వృత్తిదారులకు వయస్సుతో సంబంధం లేకుండా ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి రుణం మంజూరు చేయాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరు చేసే వాగ్దానాలతోపాటు సూపర్ సిక్స్ తక్షణమే అమలు చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన చేతి వృత్తిదారులకు పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. కులం పేరుతో చేస్తున్న దాడుల నుంచి కాపాడటానికి సామాజిక భద్రతా చట్టాన్ని అమలు చేసి చేతి వృత్తిదారులకు రక్షణ కల్పించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గొర్లి వెంకటేశ్వర్లు, ఎ. కోటేశ్వరరావు, జి. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


స్వామివారిని బేడా మండపంలో ఊరేగిస్తున్న అర్చకులు


స్వామివారిని దర్శించుకున్న దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం బేడా మండపం చుట్టూ స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.ఎల్. సుధారాణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని సంస్థ సభ్యుల సంకీర్తనలు, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో బి. మురళీకృష్ణ, అర్చకులు పులఖండం ప్రసాద్ బాబు, పులఖండం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ జగన్నాథరావు

అనకాపల్లి: రైతులు ఎకరానికిగాను 25–30 కిలోల విత్తనాన్ని శుద్ధి చేసి 5 సెంట్ల నారుమడిలో విత్తుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. మంగళవారం తమ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 సెంట్ల నారుమడి వేసిన 12–14 రోజుల్లో 2.5 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలన్నారు. 15 నుంచి 20 రోజుల నారుమడికి సెంటుకు 160 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలని సూచించారు. 20 రోజులు నేరుగా విత్తిన వరి పైరులో గడ్డి, వెడల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు, బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మి.లీ.ల చొప్పున పిచికారీ చేయాల ని లేదా గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫెనోక్సాప్రోప్ పి ఇథైల్‌ను 350 మి.లీ.ల చొప్పున ఎకరా పొలంలో పిచికారీ చేయాలని సూచించారు. పదును చూసుకుని మొదటి దఫా యూరియాను ఎకరాకు అరబస్తా చొప్పున విత్తిన 15–20 రోజులకు వేసుకోవాలన్నారు. అధిక దిగుబడినిచ్చే మొక్కజొన్న రకాలను కాని హైబ్రిడ్లను కాని విత్తుకోవాలన్నారు. 30 రోజులు వయసు గల సజ్జ పైరులో 35 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలన్నారు. పూత దశ నుంచి కాయ ఏర్పడే దశలో పెసర/మినప పైరులో కాయ తొలుచు పురుగు నివారణకు క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు చెరకులో పసుపు ఆకుతెగులను వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి. గౌరీ, ఆర్.సరిత, శాస్త్రవేత్తలు సీహెచ్.ఎస్.రామలక్ష్మి, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

పరిశ్రమను తెరిపించాలని నిరసన

కశింకోట: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమను తెరవడానికి అనుమతించాలని పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు కోరారు. ఈ మేరకు మంగళవారం విశాఖలో కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. పరిశ్రమ మూత వల్ల 500 మంది ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలు నష్టపోతున్నాయని, పరోక్షంగా పరిశ్రమపై ఆధారపడిన సుమారు వెయ్యి కుటుంబాలు జీవనం సాగించడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలో ఉద్యోగులు ఒక్కొక్కరు 20 ఏళ్ల పైబడి పని చేసిన అనుభవం ఉందని, వారు ఇక ఇతర ఉద్యోగాలకు వెళ్లే అవకాశం లేదన్నారు. దీని దృష్ట్యా పరిశ్రమను సత్వరమే తెరవడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అనకాపల్లి: వర్షాకాలంలో గ్రామీణ ప్రజలు వివిధ రకాల వ్యాధులు బారిన పడకుండా మండల అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవో శ్రీనివాసరావు మంగళవారం ఆయన వినతిప్రతం అందజేశారు. గ్రామాల్లో పేదలు నివసించే కాలనీలలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దీని దృష్ట్యా ప్రతి కాలనీలో మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల్లో మురుగు నీటి కాలువల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వనమాల నాగభూషణం, వెంకట్రావు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పాన్ షాపులకు అపరాధ రుసుం


పాన్ షాపులకు అపరాధ రుసుం రసీదులు రాస్తున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్: మాదక ద్రవ్యాల నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు పాన్ షాపులను మంగళవారం తన సిబ్బందితో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంస్థలకు వంద మీటర్ల దూరంలో సిగరెట్లు, గుట్కాలు అమ్మకాలు చేపట్టరాదన్నారు. పాన్ షాపుల్లో గంజాయి వంటి నిషేధిత వస్తువులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యా సంస్థలకు సమీపంలో సిగెరెట్లు అమ్మకాలు చేస్తున్న 20 షాపులను తనిఖీ చేసి రూ.200 చొప్పున్న అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం


ఉగ్గినపాలెంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: పండ్ల తోటల పెంపకం చేపట్టే రైతులకు ఎకరాకు మూడేళ్లకు వివిధ రూపాల్లో రూ.94 వేలు సహాయాన్ని అందిస్తారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఉగ్గినపాలెంలో పండ్ల తోటల పెంపకం పథకంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.వి. రవికుమార్ మాట్లాడుతూ మండలంలో 30 ఎకరాల్లో 42 మంది రైతులకు పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్, ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, క్లస్టర్ ఏపీడీ మణికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, టీడీపీ నాయకులు కలగా సోమేశ్వరరావు, కలగా గోవింద, ఏపీవో ఎం. శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కామేష్, ఫీల్డు అసిస్టెంట్ చిన్నారి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. సీతానగరంలోని ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతుల భూములలో జీడి, మామిడి, కొబ్బరి మొక్కలు నాటుకొని తద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఏపీవో సుప్రియ, నాయకులు పాల్గొన్నారు.

నీటి నిల్వలతో దోమల వృద్ధి


కశింకోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూపై అవగాహన కలిగిస్తూ వైద్య, ఆరోగ్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందడానికి అవకాశం ఉన్న నీటి నిల్వలను లేకుండా చూడాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. ఇటువంటి చర్యల ద్వారా డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చునన్నారు. ఎవరికైనా 102 డిగ్రీల కంటే ఎక్కువ జ్వరం, తలనొప్పి, కీళ్ల, కండరాల నొప్పులు, ఎక్కువ అలసట, శరీరంపై ఎర్రటి దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి ఉన్నచో ఉచితంగా వైద్యాన్ని అందిస్తారన్నారు. వ్యాధి నివారణకు ప్రజలు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

